# భగవంతుడు మీలోనే ఉన్నాడు

విష్ణుదర్శన భాగ్యంబు పడయగోరి
వెదుకబోయెద వెచటికే వెఱ్ఱిమనస?
అతడు నీలోన నున్నాడు అరయుమచట
సత్యమును తెల్పుబాట ఈ సాయిమాట!

బలిచక్రవర్తి దానవవంశంలో జన్మించటంచేత అతని పేరుకి కొంత కళంకం ఏర్పడింది గాని, అతడు విష్ణుప్రియుడు, ధర్మపరాయణుడు, దానశీలి. కనుకనే శ్రీ మహావిష్ణువు అతనిని తరింపచేయగోరి వామనమూర్తిగా అవతరించి, అతడు విశ్వజిత్‌యాగం చేస్తున్న సమయంలో అతని వద్దకు వెళ్ళాడు. బలిచక్రవర్తి వామనమూర్తికి స్వాగతం పలికి "స్వామీ! ఏమికావాలి?" అని ప్రశ్నించాడు. వామనమూర్తి "బలీ! నాకు మూడడుగుల భూమి కావాలి" అన్నాడు. "మూడడుగుల భూమి దానమివ్వటమా!" అని బలిచక్రవర్తి పరిహాసంగా నవ్వి ఇంకేమైనా కోరుకొమ్మన్నాడు. కాని, వామనమూర్తి తనకు అంతకుమించి ఇంకేమి అక్కర్లేదన్నాడు. బలి చక్రవర్తి తనను తాను అర్పితం గావించుకోవాలనే ఉద్దేశ్యంతోనే వామనమూర్తి ఈ కోరిక కోరాడు. బలి అనగా త్యాగము, అర్పితము అని అర్థము. బలిచక్రవర్తి తన పేరుకు తగినట్లుగా వామనమూర్తికి తనను తాను అర్పితం గావించుకున్నాడు. లోకంలో ధనకనకవస్తువాహనాదులను దానం చేసేవారు ఎంతోమంది ఉన్నారు కాని, బలిచక్రవర్తివలె తనను తాను అర్పితం గావించుకోవటమే నిజమైన దానము.

శిబిచక్రవర్తికూడా బలిచక్రవర్తివలె త్యాగశీలి. ఒక పర్యాయం ఒక డేగ ఒక చిన్న పక్షిని తరుముకుంటూ రాగా, శిబిచక్రవర్తిని ఆశ్రయిస్తే తనకు రక్షణ లభిస్తుందనే ఉద్దేశ్యంతో అది వచ్చి శిబిచక్రవర్తిపై వ్రాలింది. వెనకనే డేగ వచ్చి ఆ పక్షిని తాను తరుముకుంటూ వచ్చానని, అది తన ఆహారం కాబట్టి, దానిని తనకు ఇచ్చివేయమని శిబిచక్రవర్తిని కోరింది. అప్పుడు శిబి "ఈ పక్షి నన్ను ఆశ్రయించింది. నన్ను ఆశ్రయించినవారిని రక్షించటం నా ధర్మం. కాబట్టి ఈ పక్షిబరువుకు సరితూగేటంత మాంసమును నా దేహమునుండి కోసి ఇస్తాను" అన్నాడు. అదేప్రకారం తన దేహమునుండి మాంసమునుకోసి డేగకు ఇచ్చాడు.

srisathyasaivachanamrutam

## భారత సంస్కృతి ఔన్నత్యం - నేటి స్థితి

శ్రీరాముడు పితృవాక్య పరిపాలన నిమిత్తం రాజ్యాన్ని త్యజించి, 14 సంవత్సరాలు అరణ్యవాసం చేశాడు. గాంగేయుడు తండ్రియొక్క సంతోషం కోసం తాను వివాహమాడనని ప్రతిజ్ఞచేసి, జీవితాంతం బ్రహ్మచారిగా నిలిచిపోయాడు. దృఢమైన దీక్ష గలవాడు కనుకనే, అతనికి భీష్ముడని పేరు వచ్చింది. ఇట్టి త్యాగపురుషులు, మహనీయులు భారతదేశమున ఎంతోమంది జన్మించారు.

ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన
　　మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
　　స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
　　ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
　　ధీశక్తి చూపిన దివ్యభూమి

చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు జననమంది
భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ
బాధ్యతంత మీదె భక్తులార!

ఇట్టి త్యాగభూమి, యోగభూమి, కర్మభూమి అయిన ఈ భారతదేశంలో కేరళ రాష్ట్రము పేరెన్నిక గన్నది. దానశీలియైన బలిచక్రవర్తివలన, అవతారపురుషుడైన వామనమూర్తి వలన, కేరళ గొప్ప కీర్తి సంపాదించింది. అడిగినవారికి లేదనకుండా ఇవ్వటం కేరళీయుల సంప్రదాయం. త్యాగానికి పెట్టినపేరు, పుట్టినిల్లు కేరళ రాష్ట్రం. ఇలాంటి త్యాగభూమిని ఈనాడు భోగభూమిగా మార్చటానికి ప్రయత్నిస్తున్నారు.

పరమపావనమైన భారతావనియందు
　　సహనమన్నదె మనకు చక్కదనము

sri sathyasai vahanamrutam

ప్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి
ఘన సత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశనీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగ లేదొ
అట్టులైనారు భారత ప్రజలు నేడు

ఈనాడు భారతీయులలో ఐకమత్యం లోపించింది; మనిషికీ, మనిషికి మధ్య ద్వేషమనే మంట రగులుతోంది. దయ, ప్రేమ, సత్యము, సహనము వంటి మానవతాగుణములను కోల్పోయిన తరువాత మానవుడు ఉండి ప్రయోజనమేమిటి? ద్వేషము, అసూయ, ఆడంబరమువంటి దుర్గుణాలను పెట్టుకొని "నేను మానవుడను" అని చెప్పుకోవటం సిగ్గుచేటు. మానవత్వం లేనివానికి మానవుడనని చెప్పుకోవటానికి అర్హత లేదు. మానవుడై పుట్టినందుకు కనీసం ఒక్కమానవతా గుణమునైనా ఆచరణలో చూపించాలి.

మానవతా గుణములేనివారు, నిరంతరము పరులను విమర్శించేవారు దేశనాయకులు ఎలా కాగలరు? అలాంటివారు దేశనాశకులనే చెప్పవచ్చు. దేశనాయకుడైనవాడు మంచిగా, ప్రేమగా మాట్లాడాలి. పరదూషణకు పాల్పడకూడదు. పరులయందు కనిపించే దోషములన్నీ తనయందున్న దోషములయొక్క ప్రతిబింబములే అని గుర్తించాలి. అసలు పరులయందు దోషములను వెతికే అధికారం ఎవ్వరికీ లేదు. పరుల దోషములను వెతికేవాడు పాపియే! పవిత్రమైన పలుకులు పలికే నిమిత్తం నోరు ఇవ్వబడింది. దాన ధర్మముల నాచరించే నిమిత్తం హస్తములు ఇవ్వబడినాయి. సద్విషయాలను శ్రవణం చేసే నిమిత్తం చెవులు ఇవ్వబడినాయి. ఈవిధంగా ప్రతి అంగమునూ, ప్రతి ఇంద్రియమునూ సార్థకంగావించుకోవలసిన మానవుడు

sri sathyasai vachanamrutam

వాటిని దుర్మార్గంలో ప్రవేశపెడుతున్నాడు. ఈనాడు చదువులు పెరిగిపోయాయిగాని, ఇంద్రియాలు పూర్తి దిగజారిపోయాయి. ఇంద్రియం నిగ్రహం చేకూర్చని చదువులెందుకు?

చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెఱుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతి నున్నను
హీను డవగుణంబు మానలేడు.

తరచి చదువు చదువ తర్కవాదమెకాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు
ఇట్టి చదువు చదివి చావంగ నేటికి?
చావులేని చదువు చదువవలయు!

అదియే ప్రేమ. ప్రేమకు చావు లేదు; ప్రేమకు మార్పు లేదు. ప్రపంచంలో అన్నీ మార్పు చెందుతాయి. కాని ప్రేమ ఒక్కటే Immortal. ఇట్టి ప్రేమను సాధించాలంటే దుర్గుణాలను, దురాలోచనలను దూరం చేసుకోవాలి. Removal of immorality is the only way to immortality. ఈనాడు ప్రపంచంలో ద్వేషం పెరిగిపోయింది. ఇంక దేహాన్ని కట్టెలు కాల్చనక్కర్లేదు; ద్వేషమే దేహాన్ని కాల్చి భస్మం చేస్తుంది. సద్గుణాలను అభివృద్ధిపరచుకొని పరమశివుని సాక్షాత్కరింప చేసుకోవలసిన మానవుడు దుర్గుణాలను పెంచుకొని శవంగా మారిపోతున్నాడు. వేదికపై చెప్పే ఉపన్యాసాలలో హీరోగా, ఆచరణలో జీరోగా ఉన్నాడు. స్వార్థస్వప్రయోజనాలలో మునిగి తన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాడు.

ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా మీరు మానవులై పుట్టినందుకు మానవతా విలువలను పోషించుకొని, మానవులుగా బ్రతకాలి. "నేను మానవుడను" అని ధైర్యంతో చెప్పుకోవటానికి తగిన అర్హతను మీరు సంపాదించాలి. దేశప్రతిష్ఠను, భారతీయ సంస్కృతి యొక్క గౌరవ, మర్యాదలను కాపాడాలి.

sri sathyasaivachanamrutam

ఇది నాదు మాతృదేశము
ఇది ప్రియ మాతృభాష ఇది నా మతమం
చెదగొట్టి నుడువ నేరని
బదికిన జీవి యొకండీ వసుధను గలడా!

దేశాభిమానం, భాషాభిమానం, సంస్కృతిపట్ల అభిమానం లేనివారు దేశానికి అపకీర్తి తెప్పించే చీడపురుగులవంటివారు. అలాంటివారికి దూరంగా ఉండాలి. మానవునికి దేశాభిమానం, దేహాభిమానం ఎంత ప్రధానమో దైవాభిమానం, ధర్మాభిమానంకూడ అంత అవసరం.

## ఎవరి దుర్గుణాలు వారిని భస్మం చేస్తాయి

ప్రేమస్వరూపులారా! నిన్నటి దినము మీరు డ్రామాలో చూశారు – భస్మాసురుడు తాను చేయిపెట్టిందల్లా భస్మమై పోవాలని ఆశించాడు. కాని, కట్టకడపటికి ఏమైంది? తన హస్తం తననే భస్మం చేసింది. అదేరీతిగా, ఎవరి దుర్గుణాలు వారినే బాధిస్తాయి; భస్మం చేస్తాయి. కనుక, మీరు పరులలోని దుర్గుణాలను గురించి యోచించకూడదు. పరులను దూషించేవాడు పాపి; పరులను గౌరవించేవాడే పుణ్యుడు. "సర్వ జీవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి" అట్లే "సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" ఎవరిని విమర్శించినా మీ దేవుణ్ణి మీరు విమర్శించినట్లే; ఎవరిని గౌరవించినా మీ దేవుణ్ణి గౌరవించినట్లే. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినట్లు, దేహమే దేవాలయం, జీవుడే ఇందులోని దేవుడు. కనుక మానవుడు ఏదేహాన్ని చూసినా దేవాలయాన్ని చూసినట్లుగా భావించి గౌరవించాలి. అప్పుడే తన జీవితం సార్థకమౌతుంది. ఇతరులు కూడా తనను గౌరవిస్తారు. కాని, ఈనాటి మానవులలో అట్టి విశాల భావాలు అడుగంటిపోయాయి. తాను ఇతరులను గౌరవించడు గాని, తనను అందరూ గౌరవించాలని ఆశిస్తున్నాడు. ఇది అసాధ్యం.

## దేహభావాన్ని వీడి దైవభావాన్ని పెంచుకోండి!

భగవంతునికోసం మీరు బయటి ప్రదేశంలో వెతుకనక్కరలేదు; బయట మీకు కనిపించదు. భగవంతుడు మీలోపల, వెలుపల, సర్వత్ర వ్యాపించియున్నాడు. నిజంగా అట్టి దైవభావంతో

sri sathyasai vachanamrutam

చూస్తే మీకు దైవం తప్పక సాక్షాత్కరిస్తాడు. 'నేను మానవుడను' అనుకున్నంత కాలమూ మీరు మానవులుగానే ఉంటారు. దేహభావాన్ని విసర్జించి దైవభావాన్ని అభివృద్ధి పరచుకోండి. అప్పుడే మీరు ధన్యులౌతారు. ఇట్టి సత్యబోధ సల్పేందుకే వామనమూర్తి బలి చక్రవర్తి వద్దకు వచ్చాడు. "బలీ! నీవు సామాన్యుడవు కాదు. నేను నీయందే ఉన్నాను. దేహం కేవలం ఒక తోలుబొమ్మ. ఇందులోనే నివసిస్తున్నది శాశ్వతమైన దివ్యత్వం" అన్నాడు. కాబట్టి మీరు, భగవంతుడు వేర్వేరు కాదు. మీరు భగవంతునితోనే ఉన్నారు; భగవంతునిలోనే ఉన్నారు; భగవంతునికోసమే ఉన్నారు. ఈ పవిత్రభావాన్ని మీరు అభివృద్ధి పరచుకున్నప్పుడు మీరు ఆచరించే సమస్త కర్మలూ పవిత్రంగా రూపొందుతాయి.

**రాజకీయాలకు దూరంగా ఉండండి!**

మన శ్రీశైలం స్కూలుకు చెందిన విద్యార్థి పవిత్రమైన హృదయంతో మాట్లాడినాడు. అసలు ప్రపంచంలోని విద్యార్థులంతా పవిత్ర హృదయులే, చిత్తశుద్ధిగలవారే! కాని, వారి పవిత్రమైన హృదయాలను పెద్దలే పాడుచేస్తున్నారు. విద్యార్థులారా! మీరు సమాజంలో ప్రవేశించి సేవ చేయండి. ఏ పనైనా చేయండి గాని, రాజకీయాల్లో మాత్రం చేరకండి. రాజకీయాలు మీ హృదయాలను పాడుచేస్తాయి. మీరు చెడిపోవాలనుకుంటే రాజకీయాల్లో ప్రవేశించండి; ఆదర్శపురుషులు కావాలనుకుంటే సద్గుణాలను పోషించుకోండి. పూర్వం భారతదేశంలో రాజకీయ నాయకులు ఎంతో పవిత్రంగా, ఆదర్శప్రాయులుగా ఉండేవారు. ఆనాడు జయప్రకాశ్ నారాయణ్, సుభాష్ చంద్రబోస్ వంటి నాయకులు వస్తున్నారంటే, వారి సమావేశాల్లో పాల్గొనటానికి చిన్నపిల్లలు కూడా గుంపులుగుంపులుగా బయల్దేరేవారు. ఆనాటి విద్యార్థులు తమ గృహాలలో ఆదర్శపురుషుల ఫొటోలు పెట్టుకునేవారు. కాని, ఈనాడు ఎవరి రూమ్‌లో చూసినా సినిమా యాక్టర్ల చిత్రాలే కనిపిస్తాయి.

**'ప్రేమయే నాకున్న పెద్ద ప్రాపర్టీ'**

ప్రేమస్వరూపులారా! ఆనాటి నాయకులు పవిత్రమైనవారు కాబట్టే, అందరూ వారిచేత ఆకర్షింపబడేవారు. మీరు కూడా అట్టి పవిత్ర హృదయులు కండి. అప్పుడు అందరూ మిమ్మల్ని చూసి ఆకర్షింపబడతారు. ప్రతి మానవునియందు ఒక గొప్ప 'మ్యాగ్నెట్' ఉన్నది. అదియే ప్రేమ. ప్రేమయే దైవం. ఒక చిన్న ఉదాహరణ; ఈనాడు నేను మిమ్మల్ని ఇక్కడికి

sri sathyasai vachanamrutam

రమ్మనిపిలిచానా? ఆహ్వానించానా? లేదే! నా ప్రేమయే మిమ్మల్ని ఆకర్షించింది. ప్రేమయే నాకున్న పెద్ద ప్రాపర్టీ. నాకు మరో ప్రాపర్టీ అక్కర్లేదు. ప్రేమను మించిన ప్రాపర్టీ ఇంకెవరి దగ్గరా లేదు. మీరుకూడా ఈ ప్రాపర్టీని అభివృద్ధిపరచుకోండి. తోటివారిని ప్రేమతో పలకరించండి. మృదుమధురంగా మాట్లాడండి. అప్పుడందరూ మీకు మిత్రులౌతారు. అయితే, లౌకికమైన మిత్రులను సంపాదించుకోవటం గొప్పతనం కాదు. వారిని ఎంత సులభంగా సంపాదించుకుంటారో అంత సులభంగా పోగొట్టుకుంటారుకూడా. కనుక మీరు భగవంతునితో మైత్రిని సంపాదించుకోవాలి. అందుకోసం సర్వమును త్యాగం చేయటానికి సిద్ధంగా ఉండాలి. దేహాన్నైనా త్యాగంచేసి భగవత్ప్రేమను సాధించాలి.

**(10-9-2000 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam